క్లుప్తంగా

డాక్టర్‌కు ప్రశంసాపత్రం అందజేత



ప్రశంసాపత్రం అందుకుంటున్న విజయ్‌కుమార్

అశ్వారావుపేట: స్థానిక ఏరియా ఆస్పత్రి ఆర్ఎంవో విజయ్‌కుమార్‌కు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం కొత్తగూడెంలో ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఇప్పటి వరకు ఐదుగురు గడ్డి మందు సేవించిన వారిని, పలువురిని ప్రమాదకర పరిస్థితిలో ప్రాణాపాయ స్థితి నుంచి వైద్యంతో కాపాడినందుకు ఈ ప్రశంసను అందుకున్నట్లు తెలిపారు. తనకు సేవలందించేందుకు సౌకర్యాలు కల్పించిన ఎమ్మెల్యే ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా రుక్మిణి ఉన్నారు.

ఎంఎస్‌వో రెహమత్‌కు..

అదేవిధంగా అశ్వారావుపేట సీహెచ్‌సీలో ఎంఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న ఎండీ.రెహమత్‌ను ఉత్తమ సేవలను అభినందిస్తూ కలెక్టర్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడిని కలిసిన గిరిజనులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న గిరిజనులు

అశ్వారావుపేటరూరల్: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్‌ను శుక్రవారం అశ్వారావుపేట మండలం రామన్నగూడెం గిరిజనులు హైదారాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గ్రామ పరిధిలోగల సర్వే నంబర్లు 30, 36, 39లో ఉన్న భూములపై కలెక్టర్, హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం జాయింట్ సర్వే చేయించి, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు ఆయన స్పందించి సమస్య పరిష్కరించి, న్యాయం జరిగేలా చూస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దిశ ఫౌండేషన్ సొసైటీ అధ్యక్షులు సాగర్, వైస్ చైర్మన్ బానోతు నందు నాయక్, మడకం నాగేశ్వరరావు, మడకం కన్నారావు, కొర్సా శ్రీను, కొర్సా నాగరాజు ఉన్నారు.

నేడు పొంగులేటి పర్యటన

గుండాల: ఉమ్మడి గుండాల మండలంలో శనివారం రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించనున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు ఎస్‌కె.ఖదీర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కాచనపల్లి పంచాయతీ జగ్గతండా నుంచి లక్ష్మీదేవిపల్లి వరకు బీటీ రోడ్డు, తురుబాక గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, ఇప్పలగుంపు బీటీ రోడ్డుకు శంకుస్థాపనలు, మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆళ్లపల్లిలో కేజీబీవీ భవనం ప్రారంభం, ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు.

29, 30 తేదీల్లో కేన్సర్ నిర్ధారణ శిబిరాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం రెడ్‌క్రాస్ సొసైటీ, మారుతీ నర్సింగ్ కళాశాల, లయన్స్‌క్లబ్, వికాస తరంగిణి సంయుక్త ఆధ్వర్యంలో భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లో రెండు రోజుల పాటు ఉచిత కేన్సర్ వ్యాధి నిర్ధారణ చికిత్స శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఎస్ఎల్.కాంతారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న భద్రాచలం పట్టణంలోని మారుతీ కళాశాలలో, 30న దుమ్ముగూడెం ప్రభుత్వాస్పత్రిలో శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేన్సర్ చికిత్సలో నిపుణులైన హైదరాబాద్ ఎంఎన్‌జే ఆస్పత్రి వైద్యులతో పాటు స్థానిక వైద్యులు జయభారతి, మధుమోహన్‌రెడ్డి పాల్గొని పరీక్షలు చేస్తారని తెలిపారు.

వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మణుగూరు టౌన్: సింగరేణి సేవా సమితి, వైద్యారోగ్య విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం రాజుపేటలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 97 మందికి వివిధ రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. వైద్య శిబిరాన్ని డీజీఎం(పర్సనల్) రమేశ్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో వెంకట రమణయ్య, వైద్య సిబ్బంది భవాని, నాగసాయి, సేవా కో ఆర్డినేటర్ మారేశ్వరరావు పాల్గొన్నారు.

మంత్రి గారూ.. మా సమస్యలు వినండి

ఏళ్ల తరబడి అభివృద్ధికి దూరాన ఏజెన్సీ

- అందని ద్రాక్షగానే ప్రభుత్వ పథకాలు
- నేడు మంత్రి పొంగులేటి పర్యటన



గుండాల-ఆళ్లపల్లి మధ్య కిన్నెరసానిపై నిలిచిన వంతెన పనులు

గుండాల: గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో నేడు(శనివారం) రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించనున్నారు. అయితే, ఉమ్మడి గుండాల మండలంలో అనేక సమస్యలు రాజ్యమేలుతుండగా మంత్రి పర్యటనతోనైనా భరోసా లభిస్తుందని స్థానికులు ఆశిస్తున్నారు. అటవీ శాఖ అనుమతులు లేక నిలిచిపోయిన రహదారులు, బ్రిడ్జీలు ఏళ్ల తరబడి గిరిజన గ్రామాల ప్రజలు అవస్థలు పడుతూనే ఉన్నారు. ఆళ్లపల్లి మండలం ఏర్పాటు జరిగి తొమ్మిదేళ్లయినా ప్రభుత్వ భవనాలను మోక్షం లేదు. సాగునీటి ప్రాజెక్టులు నిరుపయోగంగానే ఉంటున్నాయి. బస్టాప్‌లు, ప్రభుత్వ భవనాలు అసలే లేవు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. మొబైల్ సేవలు లేవు. ఇంకా గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయి. వీటన్నింటిపై గతంలో పర్యటించిన మంత్రులకు, ఎమ్మెల్యేలకు, జిల్లా అధికారులకు విన్నవిస్తునే ఉన్నారు. అయినా పట్టించుకోవడం లేదని మండల వాసులు కోరుతున్నారు. ఈ సారైనా తమ సమస్యలను పట్టించుకుని పరిష్కారం చూపుతారని మండల వాసులు వేడుకుంటున్నారు.

గుండాలలో సమస్యలు..



సాయనపల్లి- రంగాపురం మధ్య అటవీశాఖ అనుమతి లేక నిలిచిపోయిన రోడ్డు పనులు

- గుండాల రంగాపురం నడుమ ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి నిధులున్నా అటవీశాఖ అనుమతి లేక నిలిచిపోయింది.
- గుండాల–ఆళ్లపల్లి మండలాల మధ్య కిన్నెరసానిపై వంతెన నిర్మాణం నిలిచిపోయింది.
- మండల కేంద్రంలో 50 గ్రామాల కూడలికి బస్టాండ్ సౌకర్యం లేదు. కనీసం బస్టాప్ కూడా లేదు.
- మండల కేంద్రంలో డ్రెయినేజీ వ్యవస్థ లేదు.
- ప్రభుత్వాస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలి
- తహసీల్దార్ భవన నిర్మాణానికి నిధులు లేక పనులు నిలిచిపోయాయి.
- ముత్తాపురం – దొంగతోగు, ముత్తాపురం పెత్తదోగు మధ్య రోడ్డు సౌకర్యం లేదు.
- కొడవటంచ వద్ద కిన్నెరసానిపై హైలెవల్ బ్రిడ్జీ నిర్మించాలి
- చింతపండు గిడ్డంగి, వ్యవసాయ మార్కెట్ గిడ్డంగి నిరుపయోగంగా ఉంటున్నాయి.
- వాగులపై ఎత్తిపోతల పథకాలు పనిచేయట్లేదు.

ఆళ్లపల్లిలో..



ప్రభుత్వ పాఠశాల గదుల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు

- మండలం ఏర్పాటై తొమ్మిదేళ్ల కావస్తున్నా ప్రభుత్వ భవనాలు లేవు.
- ఆళ్లపల్లి – కొత్తగూడెం డబుల్ రోడ్డు, కిన్నెరసానిపై హై లెవల్ వంతెన నిర్మాణం లేదు.
- మర్కోడు – అడవిరామారం, ఆళ్లపల్లి– పెద్ద వెంకటాపురం, సింగారం గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు. మర్కోడు–రేగళ్ల మధ్య అటవీశాఖ అనుమతి లేక రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది.
- కిన్నెరసానిపై అతిపెద్ద ఎత్తిపోతల పథకంమూలన పడింది.
- మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, బీసీ, ఎస్సీ వసతి గృహాలు లేవు.
- మండల కేంద్రంలో బస్టాండ్ సౌకర్యంలేదు
- ఉమ్మడి గుండాల మండలాల్లో అన్ని గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్‌లు ఉన్నా, నెట్‌వర్క్ సేవలు లేవు.
- వినియోగంలో లేని పల్లెప్రకృతి వనాలు, క్రీడా మైదానాలు, డంపింగ్ యార్డులు.
- అప్‌గ్రేడ్‌కు నోచుకోని ప్రభుత్వాస్పత్రి.

నిరంతరం ప్రజల పక్షమే..



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

చండ్రుగొండ: సీపీఐ నిరంతరం ప్రజల పక్షమే వహిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే.సాబీర్‌పాషా అన్నారు. మండలంలోని దామరచర్ల గ్రామంలో శుక్రవారం చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి రెండు మండలాల మహాసభ నిర్వహించారు. ఈ ప్రాంత ఆదివాసీ, గిరిజనులు పోడు పట్టాల కోసం సాగించిన ఉద్యమాల్లో పార్టీ ముందు వరుస ఉందన్నారు. సీతాయిగూడెంలోని వెంగళరాయసాగర్ అలుగుకు పెద్దఎత్తున పడిన గండి మరమ్మతుల కోసం ప్రభుత్వంతో పోరాడి నిధుల మంజూరు చేయించిన ఘనత సీపీఐదేనన్నారు. అనంతరం రెండు మండలాల పార్టీ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చండ్రుగొండ మండల కార్యదర్శిగా బొర్రా కేశవులు, సహాయ కార్యదర్శిగా కుర్సం రాములు, గుంగుల లక్ష్మీనారాయణతోపాటు 15 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. అన్నపురెడ్డిపల్లి మండల కార్యదర్శిగా ఊకే నారాయణ, సహాయ కార్యదర్శిగా పలగాని రామకృష్ణతోపాటు మరో 15 మందిని మండల కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి ఎస్కే సలీం, నరాటి ప్రసాద్, కంచర్ల జమలయ్య, గార్లపాటి రామనాధం, నేరెళ్ళ రమేష్, జడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మవోయిస్టులకు సహకరించొద్దు..

పినపాక: మండల పరిధిలోని ఆదివాసీ గ్రామాలు విప్పల గుంపు, సుందరయ్య నగర్ వలస ఆదివాసీ పిల్లలకు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రాజకుమార్ నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీ ప్రజలు మావోయిస్టులకు సహకరించొద్దన్నారు. ప్రభుత్వ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. అసాంఘిక శక్తులకు సహకరించి జైలు పాలు కావొద్దని సూచించారు.



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రాజ్ కుమార్

పోరాటాలకు సిద్ధంగా ఉండాలి

అశ్వారావుపేటరూరల్: పేదల పక్షనా పోరాటాలకు నాయకులతోపాటు ప్రతీ కార్యకర్త, నాయకులు సిద్ధంగా ఉండాలని సీపీఎం నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని వినాయకపురం గ్రామంలోగల చంద్ర ఫంక్షన్ హాల్‌లో రెండు రోజులపాటు జరిగే ఈ శిక్షణా తరగతుల ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 'మతం–ఉన్మాదం' అనే అంశంపై పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పిట్టల అర్జున్, 'పార్టీ విశిష్టత–పార్టీ కార్యక్రమం' అంశంపై పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ వివరించారు. నాయకులు ముళ్లగిరి గంగరాజు, వెంకటేశ్వరరావు, గోవింద్, సూరిబాబు, నిర్మల పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మణుగూరు రూరల్: యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటామని రామానుజవరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.రమేష్ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాలలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు సత్యం, భుజంగరావు, కోటేశ్వరరావు, సుందర్‌రావు, విజయలక్ష్మీ, సురేష్, పద్మ, వసుంధర, అనిల్ కుమార్, విద్యార్థులు ఉన్నారు.

రహదారికి 'హరిత' పందిరి..



వేదాంతపురం గ్రామ శివారులో పందిరిలా కలిసి ఉన్న వృక్షాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వాగొడ్డుగూడెం నుంచి ఊట్లపల్లి వెళ్లే ప్రధాన మార్గంలో వేదాంతపురం గ్రామ శివారులో రహదారికి ఇరువైపులా ఉన్న వృక్షాలు కలిసిపోయి రోడ్డుకు వేసిన పచ్చని పందిరిలా కనిపిస్తున్నాయి. అదేవిధంగా పచ్చని చెట్లకు ఎరుపురంగు పూలు పూసి కనువిందు చేస్తున్నాయి. దీంతో ఈ మార్గంలో వెళ్లే వారు వీటిని ఆసక్తిగా చూస్తున్నారు. ఎండ అధికంగా ఉంటే ఈ చెట్ల కిందే సేద తీరి ఉపసమనం పొందుతున్నారు. ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

వ్యవసాయ కళాశాల సందర్శన



కళాశాలను సందర్శించిన విద్యార్థినులు

అశ్వారావుపేటరూరల్: స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలను శుక్రవారం ఖమ్మం జిల్లా వైరాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు సందర్శించారు. పీఎంశ్రీ స్కూల్‌లో భాగంగా విద్యార్థినుల క్షేత్ర సందర్శనకు రాగా, కళాశాలలో సాగు చేస్తున్న వివిధ రకాల పంటల తోపాటు కూర గాయాల సాగు, కొబ్బరిలో అంతర పంటలు, మామిడి పంటలో రకాలుతోపాటు మునగ పంట సాగును స్వయంగా పరిశీలించారు. కాగా, ఆయా పంటల సాగు పద్ధతుల గురించి కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ దీపక్ రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల సిబ్బంది సరిత, నీలిమా, నిర్మలా, రాణి, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ జాబితా ఏర్పాటు

మణుగూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రైతు రుణమాఫీ పథకంలో భాగంగా రుణమాఫీ అయిన రైతుల పేర్లతో కూడిన జాబితా ఫ్లెక్సీని శుక్రవారం పలు కూడలి ప్రాంతాల్లో మణుగూరు ఏఈఓ కొమరం లక్ష్మణ్‌రావు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కూచిపూడిబాబు, బత్తుల శ్రీను, కొప్పుల వాసు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థికి చేయూత



పుస్తకాలు, యూనిఫాం అందజేత..

మణుగూరు రూరల్ : మండలానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ మందపాటి జగన్నాథరాజు కుమారుడు ఎక్సలెంట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతుండగా పట్టణానికి చెందిన వేణు రెస్టారెంట్ అధినేత లక్కం లక్ష్మీనారాయణ బ్రదర్స్ విద్యార్థికి రూ.12 వేల విలువ చేసే పుస్తకాలను, యూనిఫాం, బూట్లను శుక్రవారం పాఠశాలలో వితరణగా అందజేశారు. విద్యార్థికి పదో తరగతి పూర్తయ్యేంత వరకు అవసరమైన పుస్తకాలు అందించనున్నట్లు తెలిపారు. అలాగే విద్యాసంస్థల చైర్మన్ యూసఫ్ షరీఫ్ విద్యార్థికి పదో తరగతి వరకు ఉచిత విద్య అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెస్టారెంట్ నిర్వాహకులు లక్కం వెంకటేశ్వరరావు, రాము, నాగరాజు, ఎక్సలెంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఖాదర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి ప్రభుత్వ పథకం

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



బూర్గంపాడు: ఇళ్ల పట్టాలు అందుకున్న మహిళలతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక: ప్రతీ ఇంటికి ప్రభుత్వ పథకం అందుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. మండల పరిధిలోని జానంపేట, భూపతిరావుపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్లు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తున్నామన్నారు. రైతుల పక్షాన నిలిచే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీఓ సునీల్‌కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం..

బూర్గంపాడు: పేదల సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని తాళ్లగొమ్మూరులోని ఐటీసీ ఫంక్షన్‌హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ప్రస్తుతం తమకు ఇల్లు రాలేదని ఎవరు బాధపడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శిరీష, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ బాలయ్య, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాహనం అడ్డగింత..

సారపాక పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వాహనాన్ని కొందరు స్థానికులు అడ్డుకున్నారు. ముత్యాలమ్మపేటలో తమకు పదిరోజులుగా తాగునీరు రావటం లేదని వారు నిరసన వ్యక్తం చేశారు. అధికారులు వారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో వారు ఆందోళన విరమించారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే వెంకట్రావు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక సమీపంలో గల ప్రధాన రహదారిపై ఉన్న వంతెన గతేడాది వచ్చిన గోదావరి వరదలకు కృంగి పోగా దాని స్థానంల్లో నూతనంగా నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. వంతెన కృంగి రాకపోకలకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లగా వంతెన నిర్మాణానికి రూ 2.70 కోట్లను మంజూరు చేయగా, అందుకు సంబంధించిన పనులను ఎమ్మెల్యే లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. వంతెన పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధిలో అవినీతి జరిగితే కఠిన చర్యలు



విచారణ చేపడుతున్న అధికారులు

చండ్రుగొండ: ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా అసిస్టెంట్ డీఆర్‌డీఓ రవి ఉపాధి అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. మండల కేంద్రం చండ్రుగొండలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి పథకం ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 ఏడాది 348 పనులకుగాను రూ. 4.96 కోట్ల నిధులు వెచ్చించారు. సదరు పనులపై సామాజిక తనిఖీ ప్రక్రియను ఇటీవల నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి సిబ్బందికి రూ.1,01,000 జరిమానా, పెనాల్టీలు వేశారు. ఈ సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి రమణ, అసిస్టెంట్ విజిలెన్స్ అదికారి అనుష, క్వాలిటీ కంట్రోల్ అధికారి అనిల్‌కుమార్, ఏపీఓ శ్రీను పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు పాటుపడాలి



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి

మణుగూరు రూరల్: మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్, మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ కె.సూరిరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల ఉచ్చులో పడి యువత, విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు యువత, విద్యార్థులు కీలక భూమిక పోషించాలన్నారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ భద్రయ్య, మండల లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అంకం సర్వేశ్వరరావు, లీగల్ ఎయిడ్ సభ్యుడు పోశం భాస్కర్, న్యాయవాదులు రుద్ర వెంకట్, ప్రభుకిరణ్, రమేష్, పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంపు నివారణకు సమన్వయంతో పనిచేయాలి

మణుగూరు రూరల్: వరద ముంపు నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీఓ తేళ్లూరి శ్రీనివాసరావు, సింగరేణి స్టేట్ ఆఫీసర్ రాజు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. భారీ వర్షాలకు కట్టువాగు, మోట్లవాగు, కోడిపుంజుల వాగులతో వచ్చే వరద ప్రభావాన్ని లోతట్టు ముంపు ప్రాంతాల్లో నివారణ చర్యలపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, సింగరేణి సూపరింటెండెంట్ ఇంజనీర్, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ రమేష్ పాల్గొన్నారు.

పదోన్నతుల పత్రాలు ఇవ్వాలి

మణుగూరు టౌన్: యాజమాన్యం నిర్వహించిన ఈపీ ఆపరేటర్లకు ఏ గ్రేడ్ పదోన్నతుల పత్రాలను సకాలంలో అందించాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కార్మికుల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం పత్రాలు అందించాలని కోరారు.

పదాధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న వినోద్ క్రాంతి

దమ్మపేట: గ్రామ సమాఖ్య పరిధిలోని పదాధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో దమ్మపేట మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ ఏపీఎం వినోద్ క్రాంతి మాట్లాడుతూ... పదాధికారులకు రిసోర్స్ పర్సన్ల ద్వారా మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బ్యాంకుల ద్వారా పొందిన రుణాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థిక పరమైన లావాదేవిల నిర్వహణను తెలియజేశారు. నూతన ఆదాయ మార్గాల అన్వేషణ, రికార్డు పుస్తకాల నిర్వహణ, సామాజిక చైతన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు రమాదేవి, రమా సీసీలు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, సత్తిబాబు, చిట్టి, సాయమ్మ, మండల సమాఖ్య సభ్యులు నాగమణి, కవిత, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు వెంటనే తొలగించాలి



రోడ్డు ఆక్రమణలను పరిశీలిస్తున్న సీఐ నాగరాజు

దమ్మపేట: జాతీయ రహదారి అప్రోచ్ రోడ్డుపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని అశ్వారావుపేట సీఐ నాగరాజు దుకాణదారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మందలపల్లి రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించిన దుకాణదారులతో ఆయన మాట్లాడుతూ... నిర్ణీత పరిధి దాటి దుకాణాలను ముందుకు విస్తరింప చేయొద్దన్నారు. అదేవిధంగా జూన్ 26న యాంటీ డ్రగ్ డేను పురస్కరించుకుని, ముందస్తుగా మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సాయికిషోర్ రెడ్డి, బాలస్వామి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.